సాక్షి
అనకాపల్లి
సోమవారం । 1 । జూలై । 2024



సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి

సింహగిరికి పై ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడింది. సింహాచలేశుడిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. 8లో



ఆలయ అభివృద్ధికి విరాళం

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయ అభివృద్ధికి విశాఖకు చెందిన కేదార్‌శెట్టి కిషోర్ రూ.1,11,116 విరాళంగా అందజేశారు.

గరిష్టం/కనిష్టం
32.8/25.0

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్లపడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

27న ఐటీఐల్లో సీట్ల భర్తీకి రెండవ విడత కౌన్సెలింగ్

నర్సీపట్నం: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీకి జులై 27న రెండవ విడత కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్టు జిల్లా కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఐటీఐలో ప్రవేశం పొందాలనుకునేవారు ఆన్‌లైన్‌లో జులై 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జులై 25వ తేదీ సాయంత్రం 5 గంటలకు ముగిస్తుందని చెప్పారు. అభ్యర్థులు మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడీ ఎట్టి పరిస్థితుల్లో మార్చకూడదని తెలిపారు. ఆధార్, ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ల వివరాలు ఉండాలని, ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సమీపంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ అనంతరం అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్ ఫొటోలతో జులై 27న జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కన్వీనర్ సూచించారు. పూర్తి వివరాలకు 8977272231, 7013737243 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

నేడు జీవీఎంసీలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

ఆలస్యంగా సంత్రగచ్చి - సికింద్రాబాద్ స్పెషల్

తాటిచెట్లపాలెం(విశాఖ) : సంత్రగచ్చిలో ఆదివారం మధ్యాహ్నం 12.20 గంటలకు బయల్దేరాల్సిన సంత్రగచ్చి-సికింద్రాబాద్ (07222) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 6 గంటలు ఆలస్యంగా సాయంత్రం 6.20 గంటలకు బయల్దేరినట్లు రైల్వే అధికారులు తెలిపారు. అంతే ఆలస్యంగా ఈ రైలు ఆయా స్టేషన్‌లకు చేరుకుంటుందని పేర్కొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది(విశాఖ) : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

నేడు సీపీగా బాగ్చీ బాధ్యతల స్వీకరణ



అల్లిపురం(విశాఖ): నగర పోలీస్ కమిషనర్‌గా కొత్తగా నియమితులైన డాక్టర్ శంఖ బ్రత బాగ్చి సోమవారం ఉదయం 7 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. 1996 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ బగ్చి పశ్చిమబెంగాల్ క్యాడర్‌కు చెందిన అధికారి. ఢిల్లీ, కలకత్తా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు హోదాల్లో పనిచేశారు. ప్రస్తుత నగర పోలీస్ కమిషనర్, అదనపు డీజీపీ డాక్టర్ రవి శంకర్ అయ్యనార్ సీఐడీకి బదిలీ అయిన విషయం తెలిసిందే.

కుయ్యో.. రొయ్యో!



- గతేడాదికంటే పడిపోయిన ధర
- గతేడాది బ్రౌన్ రొయ్య కిలో రూ.380
- ఈ ఏడాది కిలోకి రూ.20 తగ్గింపు
- తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్న ఎగుమతిదారులు
- గిట్టుబాటు కావడం లేదంటున్న గంగపుత్రులు

సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట: రొయ్య ధర కుయ్యో మొర్రో అంటోంది. గత ఏడాదికంటే దారుణంగా దిగజారిపోయింది. ఎగుమతిదార్లు/వర్తకులు వీటిని ధర తగ్గించి కొనుగోలు చేస్తుండడంపై మత్స్యకారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అసలే నష్టాల్లో ఉన్న తమకు ప్రస్తుత రేట్లతో పెట్టుబడి కూడా గిట్టుబాటు కావడం లేదని వీరు ఆవేదన చెందుతున్నారు.

ఏప్రిల్ 14 నుంచి జూన్ 15వ తేదీ వరకు చేపల వేటకు విరామం పాటిస్తారు. ఆ రెండు నెలలు సముద్రంలో చేపలు, రొయ్యల సంతానోత్పత్తి, ఎదుగుదలకు వీలుగా నిషేధం అమలు చేస్తారు. జూన్ 15 తర్వాత నుంచి మత్స్యకారులు చేపల వేట మొదలు పెడతారు. ఒకసారి వేట వారం నుంచి పది రోజుల పాటు సాగిస్తారు. రెండు నెలల విరామం అనంతరం వేటాడే వీరికి రొయ్యలు పుష్కలంగా లభిస్తాయి. జూన్ నుంచి ఆగస్టు వరకు చేపలకంటే రొయ్యల లభ్యతే అధికంగా ఉంటుంది.



విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో రొయ్యలు విక్రయిస్తున్న మత్స్యకారులు

అందువల్ల మత్స్యకారులు ఈ మూడు నెలలూ రొయ్యల వేటకే ప్రాధాన్యమిస్తారు. పైగా రొయ్యలకు ఎక్కువ ధర లభించనుండడంతో వీరికి లాభదాయకంగా ఉంటుంది. అయితే ఈ ఏడాది తొలిసారి వాయేజ్ (వేటకు) వెళ్లిన బోట్లకు రొయ్యల లభ్యతే కాదు.. వాటి ధర కూడా తక్కువగానే ఉంటోంది.

విశాఖ జిల్లాలో 65 కిలోమీటర్ల తీరప్రాంతం, 32 మత్స్యకార గ్రామాలున్నాయి. 15 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో 749 మర పడవలు, 1,310 మోటారు, 488 సంప్రదాయ ఇంజిన్ లేని తెప్పలు ఉన్నాయి. మత్స్య సంపద వృద్ధి కోసం వేటకు విరామం ప్రటించిన తర్వాత జూన్ 15 నుంచి మత్స్యకారులు సముద్రంలో వేట ప్రారంభించారు. కాగా.. తూర్పు తీరంలో టైగర్, వైట్, బ్రౌన్, సింక్ రొయ్యలు మత్స్యకారుల వలలకు భారీగా చిక్కుతాయి. గత జూన్‌లో తొలి సారి వేటకెళ్లిన బోటుకు బ్రౌన్ రకం సగటున టన్ను, టైగర్ రకం 40-50 కిలోల రొయ్యలు పడేవి. కానీ ఇప్పుడు బ్రౌన్ 700-800 కిలోలు, టైగర్ 10 కిలోలకు మించడం లేదు. ఈ సారి బ్రౌన్ కంటే రేటు తక్కువుండే సింక్ రొయ్యలే ఎక్కువగా పడుతున్నాయి. అసలే అరకొరగా రొయ్యలు లభ్యమవుతుండగా.. వాటి ధరలు కూడా మత్స్యకారులకు నష్టాన్ని తెచ్చిపెడుతున్నాయి.

ధరల్లో వ్యత్యాసం



గత ఏడాది జూన్‌లో కిలో టైగర్ రొయ్యల ధర రూ.1,250 ఉండగా ప్రస్తుతం అది రూ.950కి, వైట్ రకం రూ.400 నుంచి 300కి, బ్రౌన్ రకం రూ.380 నుంచి 360కి, సింక్ రకం రూ.140 నుంచి 95కి పడిపోయాయి. ఒకసారి బోటు వేటకెళ్తే రూ.2 లక్షలకు పైగా డీజిల్‌కు, ఐస్‌కు రూ.15 వేలు, రేషన్‌కు రూ.15 వేలు, ఇతర సరకులు, ఖర్చులకు మరో రూ.10 వేలు వెరసి రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. ఇంకా పట్టుబడిన రొయ్యల్లో పది శాతం బోటు కలాసీలకు ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పుడు లభ్యమవుతున్న రొయ్యలకు, లభిస్తున్న ధరతో పోలిస్తే సగటున రూ.80 వేల నుంచి లక్ష వరకు నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. దీంతో రొయ్యల కొనుగోలు ధర పెంచాలని వర్తకులు/ఎగుమతిదారులను కోరుతుంటే డాలరు రేటు పెరిగే దాకా పెంచలేమని చెబుతున్నారని మత్స్యకారులు అంటున్నారు.

గత జూన్‌తో పోల్చుకుంటే రొయ్యలు, చేపల ధరలు ఇలా (కిలోకు)

	2024 జూన్ ధర	2023 జూన్ ధర	వ్యత్యాసం
టైగర్ రొయ్యలు	రూ.950.00	రూ.1,250	రూ.300
వైట్ రకం రొయ్యలు	రూ.300.00	రూ.400	రూ.100
బ్రౌన్ రొయ్యలు	రూ.360.00	రూ.380	రూ.20
సింక్ రొయ్యలు	రూ.95	రూ.140	రూ.45
గులివిందలు చిన్నవి (బాస్కెట్)	రూ.400	రూ.500	రూ.100
గులివిందలు పెద్దవి (బాస్కెట్)	రూ.800	రూ.1,400	రూ.600
పీతలు(బాస్కెట్)	రూ.400	రూ.600	రూ.200

రొయ్యల కొనుగోలు ధర పెంచాలి..



విశాఖలో రొయ్యలకు స్టోరేజ్ సదుపాయం లేదు. దీని వల్ల నిల్వ చేయడం కష్టంగా ఉంది. వనామీ రొయ్యల కొనుగోలుపై ఉన్న శ్రద్ధ సముద్రం నుంచి వేటాడి తెచ్చిన రొయ్యలపై లేదు. సముద్రపు రొయ్యలకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గిరాకీ ఉంది. ప్రస్తుతం ఎగుమతిదారులు/వర్తకులు కొనుగోలు చేస్తున్న ధర గిట్టుబాటు కావడం లేదు. రొయ్యల ధరలపై ఎగుమతిదారులతో చర్చలు జరిపాం. కొత్త ధరలు ఇవ్వడానికి ఇష్టపడడం లేదు. దీంతో కిలోకి రకాన్ని బట్టి రూ.50 నుంచి రూ.300 వరకు నష్టపోవాల్సి వస్తోంది. దీంతో బోటు యజమానులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేట, రొయ్యల ధరలు గిట్టుబాటు కాకపోయినా గంగమ్మ తల్లిని నమ్ముకుని వేట కొనసాగిస్తున్నారు. ఎగుమతిదారులు/వర్తకులు రొయ్యల కొనుగోలు ధర పెంచితేనే మత్స్యకారులు మనుగడ సాగించగలుగుతారు.

– సూరాడ సత్తిబాబు, ఉపాధ్యక్షుడు, వైశాఖీ డాల్ఫిన్ బోటు ఆపరేటర్ల సంక్షేమ సంఘం

ఎలక్ట్రానిక్ తూకాలు ప్రవేశపెట్టాలి



బ్రౌన్ రొయ్యకు ఇప్పుడు ఇస్తున్న ధర సరిపోవడం లేదు. రూ.360 ధర గిట్టుబాటు కావడం లేదు. కిలో బ్రౌన్ ధర రూ.400కు పెంచాలి. హార్బర్‌లో ఎలక్ట్రానిక్ తూకాలను ప్రవేశ పెట్టాలి. సాధారణ తూకాల వల్ల మత్స్యకారులు నష్టపోతున్నారు.

– వాసుపల్లి జానకీరామ్, అధ్యక్షుడు, ఏపీ మరపడవల సంఘం

పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జ్‌ల నియామకం

డిసెంబరు వరకు కొనసాగేలా ఉత్తర్వులు

నక్కపల్లి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా (పీఏసీఎస్)లకు ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించింది. సహకార సంఘాలకు గతంలో ఎన్నికలు జరిగేవి. గతంలో ఎన్నికయిన పాలకవర్గాల పదవీకాలం 2018 ఫిబ్రవరితో ముగిసింది. అప్పటి నుంచి ప్రభుత్వాలు ఎన్నికలు నిర్వహించకుండా ముగ్గురు సభ్యులతోకూడిన కమిటీని ఏర్పాటు చేసి వారిలో ఒకరిని పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమించి సంఘాలను నడిపిస్తూ వచ్చాయి. తెలుగుదేశం ప్రభుత్వంతోపాటు, తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంకూడా ఇదే పంథాను కొనసాగించింది. ప్రస్తుత పర్సన్ ఇన్‌చార్జ్‌ల పదవీకాలం వచ్చే నెలాఖరుతో ముగియనుంది. ఈ లోగా ప్రభుత్వం మారడంతో పర్సన్ ఇన్‌చార్జ్‌లు తమ పదవులకు రాజీనామా చేశారు. దీంతో సహకార శాఖలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను పీఏసీఏస్‌లకు పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తూ కోఆపరేటివ్ సొసైటీస్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 72 పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమించారు. నక్కపల్లి మండలంలో గొడిచర్ల పీఏసీఎస్‌కు యలమంచిలిలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ టి.ఆర్.వి.రవిని పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమించారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లి, వేంపాడు, నామవరం, పాయకరావుపేట, శ్రీరాంపురం, కొరుప్రోలు, పెనుగొల్లు పీఏసీఎస్‌లకు కూడా పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించారు. ప్రస్తుతం నియమితులైన ఈ పర్సన్ ఇన్‌చార్జ్‌లు ఆరు నెలల పాటు అంటే డిసెంబర్ నెల వరకు కొనసాగుతారని డీఆర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తుందా లేక పర్సన్ ఇన్‌చార్జ్‌లతోనే కొనసాగిస్తుందా అనేది వేచి చూడాలి.

గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

నర్సీపట్నం: మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ బీసీ బాలబాలికల గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి ఇటీవల నిర్వహించిన పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్, స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి తెలిపారు. ఫలితాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. సీట్ల భర్తీ కోసం జులై 2, 3 తేదీల్లో జరగనున్న కౌన్సెలింగ్‌కు విద్యార్థులను 1:2 నిష్పత్తిలో పిలుస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందజేస్తామని తెలిపారు. జూలై 2న బాలురు, 3న బాలికలకు సింహాచలం గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

రిటైర్డ్ ఎంఈవోకు స్పెషల్‌గా వీడ్కోలు

- మేళతాళాలతో ఊరేగింపు
- భారీ ఎత్తున సన్మానం

నాతవరం: పదవీ విరమణ పొందిన ఎంఈవోకు ఉపాధ్యాయులు, విద్యార్థులు విభిన్నంగా వీడ్కోలు పలికారు. మేళతాళాలతో ఊరేగించి, ఘనంగా సన్మానించారు. ఈ ఘటన నాతవరంలో ఆదివారం జరిగింది. ఇక్కడ ఎంఈవోగా పనిచేసిన తాడి అమృత్‌కుమార్ 1981లో ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరి 43 ఏళ్ల పాటు వివిధ ప్రాంతాల్లో పలు హోదాల్లో విధులు నిర్వర్తించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో గూడెంకొత్తవీధిలో 15 ఏళ్లు, నాతవరం మండలంలో 16 ఏళ్లు పనిచేసి, ఎంఈవో హోదాలో పదవీ విరమణ చేశారు. ఆయన తోటి ఉద్యోగులతో ఎంతో స్నేహపూర్వకంగా ఉండేవారు. అందరితోనూ ఆయనకు మంచి సంబంధాలు ఉండేవి. ఉపాధ్యాయుల మధ్య సఖ్యతకు ఎంతో కృషి చేశారు. కరోనా సమయంలో పలువురు ఉపాధ్యాయులతో పాటు ఇతరులకు ఆర్థిక సాయం చేశారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఏటా డిసెంబర్ 3వ తేదీన నాతవరం మండలంలోని దివ్యాంగుల విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు, పెన్నులు అందజేశారు. బీఈడీ చదివేందుకు పలువురు దివ్యాంగ విద్యార్థులకు ఆర్థికసాయం చేశారు. పలువురు పేద విద్యార్థుల చదువుకు ఆర్థికసాయం అందజేశారు. అందువల్ల అమృత్‌కుమార్ అంటే వారికి ప్రత్యేక గౌరవం ఉండేది. పదవీ విరమణ సందర్భంగా



అమృతకుమార్ దంపతులను ఊరేగింపుగా తీసుకువస్తున్న ప్రజాప్రతినిధులు అధికారులు గ్రామస్తులు

తమకు ఎంతో మేలు చేసిన ఆయనను ప్రత్యేకంగా గౌరవించాలనుకున్నారు. అందులో భాగంగా అమృత్‌కుమార్ దంపతులను మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం స్థానిక కల్యాణమండపంలో గతంలో ఏ అధికారికి జరగని విధంగా ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు అధ్యక్షతన భారీ ఎత్తున వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు నేతల విజయకుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు పైల పోతురాజు, జనసేన నర్సీపట్నం నియోజకవర్గం కన్వీనర్ రాజాన సూర్య చంద్ర, వర్తక సంఘం అధ్యక్షుడు తూతిక నాగేశ్వరరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూండ్రపు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.వి.ఎస్. సత్యనారాయణ, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు గోపినాథ్, జిల్లా కమిటీ సభ్యుడు శెట్టి సుబ్రహ్మణ్యం, నర్సీపట్నం గొలుగొండ మండలాలు ఎంఈవోలు తలుపులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంజినీరింగ్ కౌన్సెలింగ్

మురళీనగర్(విశాఖ): ఇంజినీరింగు కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ సోమవారం ప్రారంభమవుతుందని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు చెప్పారు. ఇందుకు సంబంధించి కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్), పాడేరు ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్‌లో హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 1వ తేదీ నుంచి 7వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సహాయ కేంద్రాల్లో 4 నుంచి 10వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన, 8 నుంచి 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు, 13వ తేదీన ఆప్షన్ల మార్పిడి చేసుకోవాలన్నారు. 16న సీట్ల కేటాయింపు జరగనుండగా 17 నుంచి 22వ తేదీ వరకు సెల్ఫ్ రిపోర్టింగు చేయాలన్నారు. 19వ తేదీన తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీజు ఎస్సీ/ఎస్టీలకు రూ.600లు, ఇతరులకు రూ.1200లు చెల్లించాలన్నారు. ఎన్‌సీసీ/ఇతర స్పెషల్ కేటగిరీ విద్యార్థులు ఈనెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం విజయవాడ ప్రభుత పాలిటెక్నిక్ కాలేజీకి వెళ్లి సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవాలి.

కావాల్సిన సర్టిఫికెట్లు

ర్యాంకు కార్డు, ఏపీఈఏపీసెట్ హాల్ టికెట్, ఇంటర్ మార్కుల జాబితా, ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ (పుట్టిన తేదీకి), టీసీ, ఆరు నుంచి ఇంటర్‌మీడియట్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఇంటిగ్రేటెడ్ కేస్ట్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ (2024-25), 2021 జనవరి 1 లేదా ఆ తర్వాత తీసుకున్న ఆదాయ ధ్రువపత్రం లేదా తెల్ల రేషన్ కార్డు ఉండాలి.

ఖాళీల గుర్తింపులో తర్జనభర్జన



ప్రాథమిక తరగతులు విలీనమైన విశాఖలోని మధురానగర్ మున్సిపల్ హైస్కూల్

- గత డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 1,134 పోస్టులంటూ ప్రచారం
- ప్రభుత్వ స్కూళ్లలో తగ్గుతోన్న విద్యార్థుల సంఖ్య
- 117 జీవో రద్దుపై విద్యాశాఖ వర్గాల్లో సర్వత్రా చర్చ
- జాతీయ విద్యావిధానం అమలుపై సందిగ్ధత



విశాఖ సెంట్రల్ లైబ్రరీలో డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులు

విశాఖ విద్య: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వెలువడిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. నేడో, రేపో మళ్లీ డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చేస్తుందని ప్రచారం జరుగుతుండటంతో నిరుద్యోగులు ఆశల పల్లకీలో ఊరేగుతున్నారు. అప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా 6,100 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయగా.. ఇందులో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు సంబంధించి అన్ని యాజమాన్యాల పరిధిలో 329 పోస్టులు ఖాళీ చూపించారు. తాజా మెగా డీఎస్సీలో రాష్ట్ర వ్యాప్తంగా 16,347 పోస్టుల్లో.. ఉమ్మడి విశాఖ జిల్లాకు 1,134 పోస్టులు భర్తీ చేస్తామని చెబుతుండటం ఆశలు రేకెత్తిస్తున్నప్పటికీ.. దీనిపై స్పష్టత లేకపోవడంతో నిరుద్యోగులు సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. మరో పక్క ఉపాధ్యాయల్లోనూ దీనిపై తీవ్రంగానే చర్చ జరుగుతోంది.

ఖాళీల గుర్తింపునకు కసరత్తు

ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరగనుంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని విద్యాలయాల్లో సబ్జెక్టుల వారీగా ఎన్ని ఖాళీలు ఉన్నాయనేది విద్యాశాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. మండల పరిషత్, జెడ్పీ, మున్సిపల్ మేనేజ్‌మెంట్ల పరిధిలోని స్కూళ్లతో పాటు ట్రైబల్ వెల్ఫేర్, బీసీ, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఇలా అన్నింటిలోనూ వాస్తవ ఖాళీలపై ఆ శాఖల జిల్లా విభాగాధిపతులు లెక్కతీస్తున్నారు. కానీ ఈ లోగానే ఉమ్మడి విశాఖ జిల్లాలో 1,134 పోస్టులు భర్తీ అంటూ ప్రచారం జరుగుతుండటంతో విద్యాశాఖాధికారులు సైతం తర్జనభర్జన పడుతున్నారు.

విలీన స్కూళ్ల పరిస్థితి ఏంటి?

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం అమల్లో భాగంగా గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల విలీనం జరిగింది. విశాఖపట్నంలో 2, అనకాపల్లిలో 14, అల్లూరి జిల్లాలో 1 ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులను 17 యూపీఎస్‌లలో విలీనం చేశారు. అదే విధంగా విశాఖలో 39, అనకాపల్లిలో 193, అల్లూరిలో 18 ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను 250 హైస్కూళ్లలో విలీనం చేశారు. అధికారంలోకి వస్తే ఎన్ఈపీ అమలు కోసం 117 జీవో రద్దు చేస్తామని కూటమి మ్యానిఫెస్టోలో ప్రకటించింది. ఉపాధ్యాయ సంఘాల నుంచి కూడా దీనిపై ఒత్తిడి ఉన్నందున.. 117 జీవో రద్దు చేస్తే, విలీన స్కూళ్లన్నీ మళ్లీ యథాతథంగా వెనక్కి రావాల్సి ఉంటుంది.

ప్రభుత్వ స్కూళ్ల పరిరక్షణ ఎలా?

2023-24 విద్యా సంవత్సరంలో విశాఖపట్నం జిల్లాలో 1,387 స్కూళ్లు ఉండగా, వీటిలో 3,94,334 మంది విద్యార్థులు, అనకాపల్లిలో 1,885 స్కూళ్లలో 2,22,797 మంది, అల్లూరి జిల్లాలో 2,975 స్కూళ్లలో 1,71,453 మంది విద్యార్థులు విద్యనభ్యసించారు. అయితే ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు బాగా తగ్గిపోతున్నాయి. ఈ ప్రభావం ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై పడనుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇప్పటికే మిగులు ఉపాధ్యాయులు ఉన్నట్లుగా విద్యాశాఖ వర్గాలు తరచూ చెబుతున్నాయి. మరో పక్క పాఠశాలల్లో అడ్మిషన్లు గతేడాది లక్ష్యానికి కూడా చేరుకోకపోతే, భవిష్యత్‌లో ఉపాధ్యాయ నియామకాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రభుత్వ స్కూళ్లను పరిరక్షించుకునేందుకు విద్యారంగ నిపుణులు నడుంబిగించాల్సిందే.

రాయలసీమ కింగ్స్ శుభారంభం

ప్రారంభమైన ఏపీఎల్



ట్రోఫీతో రాయలసీమ కింగ్స్ కెప్టెన్ గిరినాథ్

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) మూడో సీజన్ ఆరంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంప్ రాయలసీమ కింగ్స్ శుభారంభం చేసింది. నిరుటి ఫైనలిస్ట్ కోస్టల్ రైడర్స్‌పై ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. పీఎంపాలెంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి స్టేడియంలో ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచి లక్ష్య ఛేదనకే కింగ్స్ జట్టు మొగ్గు చూపడంతో రైడర్స్ జట్టు బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 149 పరుగులు చేసింది. జట్టు కెప్టెన్ షేక్ రషీద్ ఓపెనర్‌గా 57 బంతుల్లోనే 87 పరుగులు చేయగా మరో ఎండ్‌లో సహకారం లోపించింది. ప్రణీత్ 14, అభిషేక్ 17 పరుగులు చేయగలిగారు.



కోస్టల్ రైడర్స్ బ్యాటర్ వికెట్ తీసిన ఆనందంలో రాయలసీమ కింగ్స్ ఆటగాళ్లు

సత్యనారాయణ, కుమార్ చెరో రెండు వికెట్లు తీశారు. ప్రతిగా కింగ్స్ జట్టు 15 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి 153 పరుగులు చేసింది. హనీష్ 23, ప్రశాంత్ 38, రోషన్ 47 పరుగులు చేశారు. వంశీ 21, శ్రావణ్ 16 పరుగులతో నిలిచారు. కార్తీక్ రెండు వికెట్లు తీశాడు. అంతకు ముందు రాష్ట్ర రవాణా, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి ఏపీఎల్ మూడు సీజన్ పోటీలను ప్రారంభించారు. రాయలసీమ కింగ్స్, కోస్టల్ రైడర్స్ జట్ల మధ్య టాస్ వేసి సీజన్‌కు శ్రీకారం చుట్టారు. ఆరు జట్ల క్రీడాకారులతో పాటు కెప్టెన్లను స్టేడియంలోకి ఆహ్వానం పలకగా తొలిసారిగా బంగారుపూత పూసిన రోలింగ్ కప్‌ను ప్రదర్శించారు. చక్‌దే ఇండియా అంటూ నృత్య కార్యక్రమంతో ప్రారంభమైన పోటీల వేడుకకు ఏసీఏ, ఏపీఎల్ గవర్నింగ్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఎంపీలు శ్రీభరత్, కేశినేని శివనాథ్, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్, ఏసీఏ అధ్యక్ష, కార్యదర్శులు శరత్‌చంద్ర రెడ్డి, గోపీనాథరెడ్డి, ఏసీఏ పూర్వ కార్యదర్శి గోకరాజు గంగరాజు, వీడీసీఏ అధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి గోపీనాథరెడ్డి మాట్లాడుతూ ఈ సీజన్‌ను రెండు కోట్ల మంది స్టార్‌స్పోర్ట్స్ ద్వారా వీక్షించే అవకాశం ఉందన్నారు. బీసీసీఐ సహకారంతోనే ఏపీఎల్ మూడో సీజన్ ఈ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



స్ఫూర్తి నింపిన సాంస్కృతిక ప్రదర్శన

గూడు దక్కింది.. కూడు కరువైంది..

- మంగమ్మను వీడని కష్టాలు
- మారని కొడుకులు



రోడ్డు పక్కన అరుగుపై దీనంగా కూర్చున్న మంగమ్మ

రాంబిల్లి : అమ్మకు గూడు దక్కింది..కానీ కూడు కరువైంది. రాంబిల్లి మండలం దిమిలి గ్రామంలో తల్లి పట్ల కుమారులు వ్యవహరిస్తున్న తీరు విస్మయానికి గురి చేస్తుంది. తల్లి మంగమ్మ తన కొడుకులు తన గదిని ఆక్రమించుకొని తనను వరండాలోకి నెట్టినట్లు చర్యలు తీసుకోవాలని రాంబిల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడం..పోలీసులు కేసు కట్టకపోవడం అమ్మకు న్యాయం చేయకపోవడం తెలిసిందే. దీనిని సాక్షి జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లడం.. వెంటనే ఎస్పీ స్పందించి కొడుకు ఆక్రమించుకున్న గదిని ఖాళీ చేయించి తల్లి మంగమ్మకు అప్పగించడం జరిగింది. కానీ ఇద్దరు కొడుకులు ఆమెకు తిండి పెట్టలేదు. దీంతో ఆమె వంట చేసు కుంది. మూడో కొడుకు ఇచ్చిన రూ.100తో ఎదురింటి వ్యక్తి సహాయంతో కూర తెప్పించుకుంది. తానే వండుకొని భోజనం చేసింది. కొసనం శ్రీనివాసరావు, కొసనం కనకరాజు ఇద్దరు కొడుకులు తల్లికి తిండి పెట్టకపోవడంతో విశాఖపట్నంలో ఉంటున్న మూడో కొడుకు తన వద్దకు తీసుకువెళ్తానన్నా అక్కడి వాతావరణం పడలేదని, అపార్టుమెంట్‌లో వుండలేకపోతున్నానని మంగమ్మ వెళ్లలేదు. అంతేగాక తన మనవలు తనను కొట్టేందుకు వస్తున్నారని కన్నీరు పెట్టుకుంది. మంగమ్మ కష్టాలు కొనసాగుతున్నాయి.

స్మగ్లర్లతో మిలాఖత్

- అటవీశాఖలో ఇంటి దొంగలు
- అక్రమార్కులతో సిబ్బంది కుమ్మక్కు
- టేకు, రోజ్ ఉడ్ చెట్ల నరికివేతకు సహకారం
- సోలాబు, పరిసర గిరిజనుల ఫిర్యాదుతో ఉన్నతాధికారుల్లో కదలిక
- చింతపల్లి డివిజన్లలో ఇప్పటికే నలుగురిపై వేటు

అటవీ శాఖను ఇంటి దొంగల భయం వెంటాడుతోంది. కంచె చేను మేసిన చందంగా ఆ శాఖలో పనిచేస్తున్న వారే కాసులకు కక్కుర్తి పడి స్మగ్లర్లతో మిలాఖత్ అవుతున్నారు. విలువైన అటవీ సంపదను అడ్డదారిలో తరలించేస్తున్నారు. వీరిని గుర్తించడంలో ఆ శాఖ ఉన్నతాధికారులు తాత్సారం చేశారు. ఇంతలోనే విలువైన అటవీ సంపద తరలిపోగా.. కొంత సంపద నాశనం అయింది. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన ఆశాఖ ఉన్నతాధికారులు చింతపల్లి అటవీ డివిజన్ పరిధిలో ఇప్పటికే నలుగురిపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు.

కొయ్యూరు: మండలంలోని పెదవలస రేంజి పరిధిలో టేకుతోపాటు విలువైన ఇతర కలప జాతులు విస్తారంగా ఉన్నాయి. వీటిని 30 సంవత్సరాల క్రితం ఐదు హెక్టార్లలో నాటారు. ఇదంతా మారుమూల ప్రాంతం కావడంతో వీటిపై స్మగ్లర్ల కన్ను పడింది. వీరికి అటవీ సిబ్బంది సహకారం తోడవడంతో ప్లాంటేషన్‌లోని టేకుతోపాటు విలువైన ఇతర కలప జాతి చెట్లను తరలించేశారు. కొన్నాళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారాన్ని జీర్ణించుకోలేకపోయిన సోలాబు, పరిసర గ్రామాల గిరిజనులు స్మగ్లర్ల ఆగడాలను అటవీశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన వారు విచారణకు ఆదేశించారు. దీనిపై రెండు నెలల క్రితం విజిలెన్స్, స్క్వాడ్ డీఎఫ్‌వోలు చెట్లు తరలిపోయిన ప్రాంతాలను వేర్వేరుగా పరిశీలించారు. దీనిపై వారు సీసీఎఫ్‌కు నివేదించడం కదలిక వచ్చింది. ఆ తరువాత చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్ మళ్లీ విచారణ నిర్వహించారు. దీనిలో భాగంగా తరలిపోయిన చెట్ల వివరాలతో సీసీఎఫ్ (విశాఖ)కు నివేదించారు. దీని ఆధారంగా కొయ్యూరు ఎఫ్ఎస్‌వో సింహాద్రి, గార్డులు రాజ్ కుమార్, రాకేష్‌కుమార్‌ను ఆయన సస్పెండ్ చేశారు. పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న కారణంతో పెదవలస రేంజర్ జగదీష్‌ను సస్పెండ్ చేశారు.



నరికివేతకు గురైన టేకు చెట్టు మొదలు

తరలిపోయిన టేకు

సోలాబు ప్లాంటేషన్లో కేవలం మారుజాతి కలపను మాత్రమే అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకోగలిగారు. అటవీశాఖ గుర్తించే లోపే విలువైన 23 టేకుచెట్లను పట్టుకుపోయారు. ప్లాంటేషన్ వద్ద మిగిలిన మారుజాతి కలపను కాకరపాడు కలపడిపోకు తరలించాలని సీసీఎఫ్ ఆదేశాలు జారీ చేశారు.

- కొత్తపల్లి, గొల్లువలస ప్రాంతాల్లో కూడా మారుజాతి కలపకు చెందిన సుమారు వంద చెట్లను స్మగ్లర్లు నరికి తరలించేందుకు సిద్ధం చేశారు. మారుమూల ప్రాంతం కావడంతో వెంటనే వారు తరలించలేకపోయారు. ఈ విషయం కూడా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో అప్రమత్తమయ్యారు. అక్కడ సిద్ధంగా ఉన్న కలపను కాకరపాడు డిపోకు తరలించాలని సస్పెండైన ఎఫ్ఎస్‌వో సింహాద్రికి సూచించారు. లేకుంటే రూ.8 లక్షల వరకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు.

నల్లగొండ టేకు ప్లాంటేషన్‌లో..

- రెండేళ్లక్రితం నల్లగొండ టేకు ప్లాంటేషన్‌లో దాదాపుగా 40 వరకు టేకు ఇతర కలపజాతుల చెట్లు మాయం అయ్యాయి.దీనిపై విచారణ జరిపిన అటవీ శాఖ ఉన్నతాధికారులు గార్డు, బేస్ క్యాంప్ సిబ్బంది హస్తం ఉందని నిర్ధారించారు. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు.
- మంప బీట్ పరిధిలోని ఆర్.దొడ్డవరం సమీపంలోని టేకు ప్లాంటేషన్‌కు రక్షణ కరువైంది. ఒకప్పుడు రోజ్ ఉడ్ చెట్లు ఎక్కువగా ఉండడంతో స్మగ్లర్లు టేకు వైపు దృష్టి పెట్టేవారు కాదు. ఇప్పుడు రోజ్ ఉడ్ తగ్గిపోవడంతో వారి దృష్టి టేకు ప్లాంటేషన్లపై పడింది. మైదాన ప్రాంతంలో ఉండేవారు ఎక్కువగా టేకు కంటే రోజ్‌ఉడ్‌తో చేసిన వస్తువులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఒకప్పుడు రూ.4 వేలు ఉండే రోజ్ ఉడ్ ముక్క ధర ఇప్పుడు రూ.10వేలకు పైగా ఉంది.



మర్రిపాకల రేంజిలో దట్టమైన అటవీ ప్రాంతం

మర్రిపాకల టేకు ప్లాంటేషన్‌లో..

మర్రిపాకల రేంజ్ పరిధిలో సుమారు లక్ష ఎకరాల్లో టేకు ప్లాంటేషన్ ఉంది. వీటి వయసు 50 సంవత్సరాలకు పైగా ఉంటుందని అంచనా. వీటిపై కూడా స్మగ్లర్ల దృష్టి పడింది. ఇప్పటికే కొన్ని చెట్లను తరలించారు. అవసరమైన స్థాయిలో సిబ్బంది లేకపోవడం వల్ల పర్యవేక్షించడం కూడా అటవీశాఖకు కష్టసాధ్యంగా ఉంది.



మర్రిపాకలో రేంజిలో విలువైన టేకుచెట్లు

జిల్లా సమాచారం (హెక్టార్లలో)	
అటవీ విస్తీర్ణం	: 10.47 లక్షలు
చింతపల్లి డివిజన్	: 1,97,181
పాడేరు డివిజన్	: 1,97,872
రంపచోడవరం డివిజన్	: 63,819
చింతూరు డివిజన్	: 4 లక్షలు

తప్పు చేస్తే చర్యలు తప్పవు



అడవిని కాపాడాల్సిన సిబ్బంది అందుకు భిన్నంగా వ్యవహరించడం బాధ కలిగిస్తోంది. తప్పు ఎవరు చేసినా వదిలేది లేదు. సంపదను కాపాడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉంది.దానికి భిన్నంగా ప్రవర్తిస్తే క్రమ శిక్షణ చర్యలు తప్పవు. ఇప్పటికే పెదవలస రేంజ్‌లో కొయ్యూరు సెక్షన్‌కు సంబంధించి నలుగురిపై చర్యలు తీసుకున్నారు. మర్రిపాకల రేంజ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాం.కొన్నిచోట్ల సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ చేస్తున్నాం. ఖాళీల భర్తీపై ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాం.

– సీహెచ్ సూర్యనారాయణ పడాల్, డీఎఫ్‌వో, చింతపల్లి

ఒడిశాలో వడ్డాది వాసి మృతి

కారులో ప్రయాణికులను దించి వస్తుండగా ప్రమాదం



దొరబాబు(ఫైల్)



ఒడిశాలో ప్రమాదంలో బోల్తాపడ్డ కారు

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాదికి చెందిన కారు డ్రైవర్ అడపా దొరబాబు(46) ఒడిశాలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం ఈ సమాచారం తెలియడంతో మృతుడు స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. ఇతను కొద్ది కాలంగా విశాఖలో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. కారు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మూడు రోజుల క్రితం ప్రయాణికులతో ఒడిశా వెళ్లాడు. అక్కడ వారిని దించి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో జగదల్‌పూర్ వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని సోమవారం వడ్డాది తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో పది క్వార్టర్ మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తుండగా ఆదివారం స్వాధీనం చేసుకున్నట్టు హెచ్‌సీ సూర్యారావు తెలిపారు. అనకాపల్లి మండలం వేట జంగాలపాలెంకు చెందిన నిందితుడు సి.వెంకటేశ్వరరావును అరెస్టు చేసినట్టు ఆయన చెప్పారు.

రూ.4 కోట్ల మోసంపై ఫిర్యాదు

బీచ్‌రోడ్డు: రామ్‌నగర్‌లోని ఒక కంపెనీలో తోటి భాగస్వామి రూ.4 కోట్ల మోసం చేసినట్టు మూడో పట్టణ పోలీసులు స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ పార్థసారథి తెలిపారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి

సింహాచలం: సింహగిరికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సింహాచలేశుడిని దర్శించుకోవడానికి బారులు తీరారు. దీంతో గిరిపై ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడింది. వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేసి విశేషంగా హారతి అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.ఆలయ ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాన్ని విశేషంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

నూకాంబిక అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి

అనకాపల్లి : ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో అమ్మవారి కి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి, పిల్లపాపలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణ పరిధిలో కొంతమంది భక్తులు తమ ఇళ్ల వద్ద శనివారం రాత్రంతా అమ్మ వారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వృద్ధులు, గర్భిణులు అమ్మవారి దర్శనానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మ

మాడుగుల : మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు బారు లు తీరారు. అమ్మవారిని పుష్పాలు, నగలతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలతో ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.



అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరిన భక్తులు

రోబోటిక్ మోకాళ్ల మార్పిడితో రెండో రోజే నడక

ఆంధ్రప్రదేశ్‌లో రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ అంటే క్యూ వన్ ఆస్పత్రి అధినేత డాక్టర్ టి.రమణమూర్తి గుర్తుకొస్తారు. గత 20 ఏళ్ల కాలంలో దాదాపు 25 వేల జాయింట్ రీప్లేస్‌మెంట్‌లో శస్త్రచికిత్సలు చేశారు. కీళ్ల వ్యాధులను నిర్ధారించే అన్ని రకాల రేడియాలజీ సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. రోబోటిక్ శస్త్ర చికిత్స తర్వాత రెండో రోజే నడక ప్రారంభించవచ్చని డాక్టర్ రమణమూర్తి తెలిపారు. అధునాతన టెక్నాలజీతో శస్త్రచికిత్సలు చేస్తున్న డాక్టర్ రమణమూర్తి.. రోబోటిక్ వైద్యంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉన్నారు. ×రెండు ఎముకలు కలిసి కీళ్లు తయారు అవుతాయి. ఈ ఎముక చివరి భాగంలో తెల్లని మృదులాస్థి(కార్టిలేజ్) వల్ల నొప్పి లేకుండా నడవడం సాధ్యమవుతుంది. వయసు, జాయింట్ గాయాలు, రుమేటిక్ ఇబ్బంది వల్ల కార్టిలేజ్ అరగడాన్ని ఆర్థరైటిస్ అంటారు. నొప్పి, వాపు, రాపిడి వల్ల శబ్దాలు, మెట్లు ఎక్కలేకపోవడం, కింద కూర్చోలేకపోవడం ఆర్థరైటిస్ లక్షణాలు. శరీర బరువు నియంత్రించడం, మంచి ఆహారం తీసుకోవడం, క్రమపద్ధతిలో ఫిజియోథెరపీ చేయడం వల్ల మోకాళ్ల అరుగుదలను నివారించవచ్చు. మోకాళ్ల అరుగుదల తక్కువగా ఉన్నప్పుడు నివారణ మార్గాలు పాటించడం, నొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు నొప్పి మాత్రలు వేయడం, కీళ్లకు విస్కో సప్లిమెంటేషన్ తీసుకోవడం, కొన్ని సార్లు ఆర్థోస్కోపి ద్వారా కొంత వ్యాధి తీవ్రత తగ్గుతుంది. కానీ పూర్తిగా అరిగిన కీళ్లకు కీళ్ల మార్పిడి మాత్రమే నొప్పి నుంచి ఉపశమనం ఇవ్వగలదు౹అని డాక్టర్ రమణమూర్తి తెలిపారు. రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ ద్వారా జీరో ఎర్రర్ మోకాళ్ల మార్పిడి సాధ్యమవుతుందన్నారు. సాధారణంగా 60 ఏళ్లు పైబడిన వారికి మోకాళ్ల అరుగుదల అవుతుంది. అయితే కరోనా బారిన పడివారిలో ఎక్కువ మంది హిప్ సమస్యతో బాధపడుతున్నారు. కరోనా విముక్తి కోసం స్టెరాయిడ్స్ వినియోగించడం వల్ల 40 ఏళ్లు దాటిన వారికి కూడా హిప్ సమస్యలు వస్తున్నాయి. ఈ సమస్య గతంలో పోల్చుకుంటే ఏడు రెట్లు అధికమైందని డాక్టర్ రమణమూర్తి వివరించారు.

క్యాన్సర్‌ను ఓడించగలం

డాక్టర్ రవిశంకర్, మేనేజింగ్ డైరెక్టర్, ఓమేగా ఆస్పత్రి



క్యాన్సర్ వైద్యం అనగానే ఎక్కువ మందికి ఠక్కున ఓమేగా ఆస్పత్రి గుర్తుకు వస్తుంది. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఎంతో మందికి ఓమేగా ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవిశంకర్ వైద్య సేవలందించారు. గత 25 ఏళ్లుగా సరికొత్త విధానాలతో రోగులకు చికిత్స అందిస్తున్నారు. రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లకు చికిత్స అందించడంలో డాక్టర్ రవిశంకర్ సిద్ధహస్తులు. పలు అంతర్జాతీయ వైద్య సదస్సుల్లో పాల్గొన్న ఆయన.. ఈ వ్యాధిలో వచ్చే మార్పులు, నూతన వైద్య పద్ధతులు, ఆధునిక వైద్య ప్రక్రియల సుదీర్ఘ ప్రసంగాలు చేశారు. క్యాన్సర్‌ను తగ్గించడంలో రోగి అవయవాలపై సైడ్ ఎఫెక్ట్స్ కలగకుండా ఆయన వద్ద అందుబాటులో ఉన్న అత్యున్నత టెక్నాలజీ ఎస్‌జీఆర్‌టీ ద్వారా మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ దేశంలో మరణిస్తున్న వారిలో క్యాన్సర్ బాధితులు రెండో స్థానంలో ఉన్నారన్నారు. అనారోగ్యాలతో మిగతా వాటికంటే క్యాన్సర్ ప్రపంచ వ్యాప్తంగా మనుషులకు ముప్పుగా పరిగణిస్తోందన్నారు. ఆత్మవిశ్వాసం, ధైర్యం అంతకుమించి మంచి వైద్యం అందిస్తే క్యాన్సర్‌ను ఓడించడం సాధ్యమేనన్నారు. ఆధునిక కాలంలో పురుషుల కన్నా స్త్రీలే అధికంగా క్యాన్సర్ బారిన పడుతున్నారని వెల్లడించారు. ఇది ఆందోళన కలిగించే పరిణామన్నారు. జీవనశైలిలో మార్పులు, వాతావరణ పరిస్థితులు, పొగాకు ఉత్పత్తుల వినియోగం, మద్యం సేవించడం వల్ల క్యాన్సర్ ఎక్కువగా సోకుతోందన్నారు. ఈ వ్యాధి గురించి భయపడకుండా చికిత్స చేయించుకుని ఎంతో మంది జయించారని గుర్తు చేశారు. శరీంలోని క్యాన్సర్ కణాలను స్క్రీనింగ్ ద్వారా గుర్తించి చికిత్స అందించవచ్చని, ఇలా చేయడం ద్వారా 95 నుంచి 100 శాతం వరకు నివారించవచ్చని డాక్టర్ రవిశంకర్ వివరించారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోండి

– డాక్టర్ రవిశంకర్
ప్రముఖ అంకాలజిస్ట్, ఒమేగా క్యాన్సర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్



డా॥ బి.రవిశంకర్ (అంకాలజిస్ట్)
MD (CMC Vellore) DNB (RT)
MRCP, ECMO (Med. Onc)
FESTRO (Rad Onc.) PDCR, OCTT, MBA
Managing Director: OMEGA Hospitals

క్యాన్సర్ చికిత్సకు ప్రముఖ వైద్య నిపుణులు ఒమేగా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా॥ బి.రవిశంకర్ గత 24 ఏళ్లుగా క్యాన్సర్ రోగులకు వైద్య సేవలను అందిస్తున్నారు. ముఖ్యంగా వీరు తల మరియు మెడ భాగాల్లో, అలాగే బ్రెస్ట్ (రొమ్ము), లివర్, గైనిక్ (గర్భసంచి ముఖ ద్వారం) భాగాల్లో వచ్చే క్యాన్సర్‌కు చికిత్స అందించడంలో వీరు సిద్ధహస్తులు. అంతర్జాతీయ వైద్య సదస్సుల్లో పాల్గొంటూ ఈ వ్యాధిలో వచ్చే మార్పులను చర్చిస్తూ.. సరికొత్త విధానాలతో క్యాన్సర్‌ను నివారించడంలో పేరెన్నికగన్నారు.

కాలేయ (లివర్) క్యాన్సర్‌యొక్క రకాలు : కాలేయ క్యాన్సర్లలో రెండు రకాలు ఉన్నాయి. ప్రాథమిక మరియు ద్వితీయ కాలేయ క్యాన్సర్లు. ప్రాథమిక కాలేయ క్యాన్సర్లు చాలా వరకు కాలేయం యొక్క ఎపిథీలియల్ కణజాలాలలో వస్తాయి. నాన్ ఎపిథీలియల్ కణజాలాలలో చాలా అరుదుగా ఏర్పడతాయి. ద్వితీయ శ్రేణి క్యాన్సర్లు ప్యాంక్రియాస్, పెద్ద ప్రేగు, కడుపు, రొమ్ము లేదా ఊపిరితిత్తుల వంటి అవయవాల నుండి వ్యాపిస్తుంది.

కాలేయ క్యాన్సర్ యొక్క లక్షణాలు : కాలేయ క్యాన్సర్‌తో బాధపడుతున్న చాలా మంది వ్యక్తులు ప్రారంభ దశలలో ఏ లక్షణాలను కలిగి ఉండరు. కానీ సహజంగా క్యాన్సర్ కలిగి ఉన్న రోగులలో గల ప్రారంభ లక్షణాలు వీరిలో కనిపించవచ్చును. 1) ఒక్కసారిగా బరువు తగ్గడం, 2) ఆకలి లేకపోవడం, 3) పొత్తికడుపులో నొప్పి రావడం, 4) వికారం మరియు వాంతులు, 5) అలసట మరియు బలహీనతగా అనిపించడం, 6) హెయటీమిసిస్ (రక్తంతో కూడిన వాంతులు), 7) హైపోగ్లైసీమియా (రక్తంలో తక్కువ చక్కర స్థాయిలు), 8) అస్సైటిస్ (కడుపులో నొప్పి మరియు కడుపు ఉబ్బరం), 9) హైపర్ కాల్సిమియా (శరీరంలో కాల్షియం స్థాయిలు పెరగడం), 10. ఎరిత్రోసైటోసిస్ (ఎర్ర రక్త కణముల సంఖ్య పెరుగుదల), 11) కళ్లు, చర్మం పసుపు రంగులోకి మారడం, 12) ఎన్సెఫలోపతి (వైరల్ ఇన్ఫెక్షన్/ టాక్సిన్స్/ కొన్ని పరిస్థితుల కారణంగా మెదడు పనితీరు బలహీనపడుతుంది), 13) సుద్ద లేదా తెల్లటి మలం.

కాలేయ క్యాన్సర్ యొక్క దశలు : కాలేయ క్యాన్సర్ పురోగతిని అర్థం చేసుకునే ముందు, కాలేయ క్షీణత యొక్క సాధారణ దశలను అర్థం చేసుకోవాలి.

దశ 1- కాలేయ వాపు : ఈ దశలో కాలేయం, గాయానికి సహజంగా ప్రతిస్పందనగా వాపు ఏర్పడుతుంది. అయినప్పటికీ, కాలేయం స్వయంగా ఈ వాపు నయం చేయగలదు.

దశ 2- కాలేయ ఫైబ్రోసిస్: మొదటి దశలో ఏర్పడ్డ వాపును, చికిత్స చేయని పక్షాన, కాలేయంలో మచ్చలు ఏర్పడతాయి. తద్వారా కాలేయ విధులకు అంతరాయం కలిగించబడుతుంది. ఈ మచ్చలు క్రమంగా పూర్తి కాలేయం కణాలకు ఏర్పడి, కాలేయం స్వయంగా నయం చేసుకోలేని పరిస్థితికి చేరుకుంటుంది. ఈ దశలో కాలేయ చికిత్స కొరకు మందులు అవసరం ఉంటుంది.

దశ 3- కాలేయ సిర్రోసిస్: ఈ దశలో కాలేయంలో కోలుకోలేని మచ్చలు (సిర్రోసిస్) ఏర్పడతాయి. ఇవి ఏర్పడటానికి చాలా సంవత్సరాల నుండి దశాబ్దాలు వరకు సమయం పడవచ్చు. కాలేయ సిర్రోసిస్‌తో బాధపడుతున్న వ్యక్తులు కాలేయ క్యాన్సర్‌కు గురయ్యే అవకాశం ఎక్కువ ఉంది.

దశ 4 - కాలేయ వైఫల్యం: ఈ దశలో హెపాటిక్ (కాలేయ) పనితీరు పూర్తిగా ఆగిపోతుంది. అందువల్ల కాలేయం స్వయంగా లేదా మందులతో కూడా చికిత్స చేయబడదు. ఈ చివరి దశలో కోలుకోవడానికి కాలేయ మార్పిడి ఒక్కటే మార్గం.

కాలేయ క్యాన్సర్‌ను నయం చేయవచ్చా? చికిత్స చేయవచ్చు. కానీ కొన్ని సార్లు చికిత్స చేయడం కష్టం అవుతుంది. శస్త్ర చికిత్స, కెమోథెరపీ, థర్మల్ అబ్లేషన్, టార్గెటెడ్ థెరపీని మరియు రేడియోథెరపీ మొదలగు వంటివి కాలేయ క్యాన్సర్ చికిత్సలో వాడతారు. క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించండి. సెల్: 9849123256.

ADVT



ముగ్గురిని రక్షించిన లైఫ్ గార్డ్స్

పెదగంట్యాడ: యారాడ తీరంలో సముద్రంలోకి కొట్టుకుపోతున్న ముగ్గురిని లైఫ్ గార్డ్స్ రక్షించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివీ.. ఆదివారం సెలవు కావడంతో గాజువాకకు చెందిన నగేశ్ తన భార్య, ఇద్దరు కుమారులతో కలసి యారాడ తీరానికి వచ్చారు. సముద్రం ఒడ్డున స్నానం చేస్తున్న సమయంలో ఒక్కసారిగా వచ్చిన పెద్ద అలకు ముగ్గురు లోపలకు కొట్టుకుపోతుండగా గట్టిగా కేకలు వేశారు. అక్కడే ఉన్న లైఫ్ గార్డ్స్ కె.వెంకటేష్, కె.లోవరాజు, సీహెచ్ శ్రీను వెంటనే స్పందించారు. నగేష్‌తో పాటు అతని కుమారులు యశ్వంత్ నాయుడు, కృష్ణను రక్షించారు. సకాలంలో లైఫ్‌గార్డ్స్ స్పందించడంతో ఆ కుటుంబం ఊపిరి పీల్చుకుంది. ఆ ముగ్గురిని రక్షించిన లైఫ్‌గార్డ్స్‌ను పర్యాటకులు అభినందించారు.



లైఫ్‌గార్డ్స్ రక్షించిన వారు

క్లుప్తంగా

పూడికలు తొలగించరూ.



ఎల్లయ్య కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం

అనకాపల్లి: వర్షా కాలం వచ్చేసింది. అడపాదడపా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పట్టణ ప్రజల ఆరోగ్యం కోసం జీవీఎంసీ వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే పట్టణ నడిబొడ్డున ఎన్టీఆర్ క్రీడామైదానం ఎదురుగా ఉన్న ఎల్లయ్యకాలువలో పూడిక, చెత్తాచెదారాల తొలగింపుపై మాత్రం దృష్టి సారించలేదు. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల దోమలు వృద్ధి చెంది, రోగాలు వ్యాపిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ కాలువతో పాటు పట్టణ పరిధిలోని చిన్నా, పెద్ద డ్రైనేజీలన్నీ పిచ్చిమొక్కలు పెరిగి, రోగాలకు నిలయంగా మారాయని ఆక్షేపిస్తున్నారు. జీవీఎంసీ అధికారులు తక్షణ చర్యలు తీసుకుని డ్రైనేజీల్లో పూడిక తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



స్వామి వారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు హనుమాన్‌నగర్‌లో కొలువుదీరిన అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆది వారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్‌నగర్, సమ్మెంగపాలెం, జాలరిపేట, మంగప్పయ్యగారిఊరు, కోరంగిపాలెం గ్రామాలకు చెందిన భక్తులు వేకువజాము నుంచి ఆలయానికి తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, హోమం జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఉదారత

పరవాడ: కలపాక శివారు పెదస్వయంభూవరం గ్రామానికి చెందిన ఇందల ప్రకాశరావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న 1992 -93లో ప్రకాశరావుతో కలిసి పదో తరగతి చదువుకున్న వారు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.32 వేలు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెన్నల సన్యాసిరావు, ఎస్.వెంకునాయుడు, జి.ఎస్.నాయు డు, గండి లోకేష్, ఎం.ఆనంద్, ఎం.రాజు, బోండా భరత్, ఏడు కొండలు, జి.ఎల్. నారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

మహారాజ	:రాజా
కల్కి 2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి 2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-2
కల్కి 2898 ఏడీ	:షిర్డిసాయి
కల్కి 2898 ఏడీ	:పర్తిసాయి
కల్కి 2898 ఏడీ	:వెంకటేశ్వర
ప్రభుత్వ జూనియర్ కళాశాల	: శ్రీసత్య
కల్కి 2898 ఏడీ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 90 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-18 యూనిట్లు, బీ పాజిటివ్-31 యూనిట్లు, ఓ పాజిటివ్-39 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 224 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 198 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

క్షణక్షణం.. భయంభయం..
దోనె ప్రయాణం

వర్షాకాలం వచ్చిందంటే చాలు.. శారదానదికి ఆవల వ్యవసాయ క్షేత్రాలున్న రైతుల కష్టాలు అన్నీఇన్నీ కావు. క్షణక్షణం భయంభయంగా దోనె ప్రయాణాలు చేయాల్సిందే. ఏళ్ల తరబడి వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వంతెన నిర్మాణానికి పునాదులు పడినా.. కరోనా కారణంగా పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయింది. ఆ తర్వాత చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మళ్లీ వర్షాకాలం రావడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

- శారదానదిపై వంతెన లేక రైతుల కష్టాలు
- గత ప్రభుత్వంలో రూ.3 కోట్లతో వంతెనకు శ్రీకారం
- కరోనాతో అర్థంతరంగా నిలిచిన పనులు
- ఈ ప్రభుత్వంలోనైనా నిర్మాణం పూర్తయ్యేనా?



కశింకోటలోని గవరపేటలో శారదానదిపై రాకపోకలు సాగిస్తున్న రైతులు



వంతెన నిర్మాణ ప్రాంతం



శారదానదిని దోనెపై దాటుతున్న రైతులు, కూలీలు

కశింకోట: స్థానిక గవరపేట ప్రాంత రైతుల వ్యవసాయ భూములు, పశువుల పాకలు చాలా వరకు శారదానదికి ఆవల ఉన్నాయి. రోజూ కనీసం ఒకటి రెండుసార్లు వీరు నదిని దాటాల్సిందే. పలుమార్లు పశువుల్ని వెంటబెట్టుకుని మరీ నది మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. నీటి ఉధృతికి పశుల్ని కోల్పోయిన సంఘటనలూ ఉన్నాయి. నదిపై వంతెన నిర్మిస్తే తమ కష్టాలకు ముగింపు పలికినట్లేనని రైతుల ఆశ. ప్రభుత్వాలు మారినా.. వీరి ఆశ మాత్రం నెరవేరట్లేదు.

రూ.3 కోట్లతో వంతెనకు శ్రీకారం

ఆరేడు దశాబ్దాలుగా ఈ ప్రాంత రైతులు శారదానదిని దాటేందుకు ప్రధాన ఆధారం తాడి దోనెలే. ఒక్కోసారి నదీ ప్రవాహ ఉధృతికి, భారీ గాలులకు తిరగబడి నీట మునిగిన సంఘటనలు ఉన్నాయి. 1977లో దోనెలు మునిగిన ప్రమాదంలో ఒకే రోజు ఇద్దరు రైతులు మృత్యువాత పడ్డారు. ఆ తర్వాత కూడా అడపా దడపా దోనెలు తిరగబడి, ఈత ద్వారా నదిని దాటేటపుడు పలువురు కొట్టుకుపోయి, మరణించారు. ఈ నేపథ్యంలో ఇక్కడ నదిపై వంతెన నిర్మించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను స్థానిక రైతులు ఏళ్ల తరబడి మొరపెట్టుకూనే ఉన్నారు. దీంతో 2020లో రూ.3 కోట్లతో వంతెన నిర్మాణానికి అప్పటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నిధులు మంజూరు చేయడంతోపాటు, శంకుస్థాపన జరిపి, పనులు ప్రారంభించారు. సుమారు రూ.80 లక్షల మేర ఖర్చుచేసి వంతెన నిర్మాణానికి భూగర్భం నుంచి భూ స్థాయి వరకు నదిలో కాంక్రీట్‌తో స్తంభాలు నిర్మించారు.

వంతెనకు కరోనా కష్టాలు

పూర్తిస్థాయిలో పిల్లర్ల నిర్మాణానికి ఐరన్ రాడ్లు బిగిస్తున్న తరుణంలో కరోనా కల్లోలం మొదలయింది. దీంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కరోనా తర్వాత వంతెన నిర్మాణానికి జరిగిన ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. అప్పటి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.3 కోట్లు ఖర్చు చేసి వంతెన పూర్తి చేసేందుకు ప్రయత్నించారు. ఇందుకు నిబంధనలు అనుమతించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వంతెన నిర్మాణానికి కృషి చేశారు. ఆ ప్రయత్నాలూ ఫలించలేదు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రయత్నాలు పూర్తిగా నిలిచిపోయాయి. నదిలో నీటి మట్టం తక్కువగా ఉన్నప్పుడు పరిస్థితి ఎలా ఉన్నా వర్షాకాలం వచ్చిందంటే ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చి చేరుతుంది. ఆ పరిస్థితుల్లో గ్రామ శివారులో ఉన్న వెదురుపర్తి వంతెన మీదుగా సుమారు 3 కిలో మీటర్ల దూరం నడిచి పాలాల్లో కార్యకలాపాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి.

3 కి.మీ. వెళ్లాల్సి వస్తోంది



శారదానదిపై గవరపేటలో వంతెన నిర్మించాలి. వంతెన లేక నిత్యం నదిని దాటేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాం. వర్షా కాలంలో నదిలో నీరు ఎక్కువై, ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆ సమయంలో దోనె ప్రయాణాలు చేయలేం. 3 కి.మీ. నడిచి వేరే ఊరి మీదుగా పొలాలకు చేరుకోవాలి. రైతుల ఇబ్బందులు గుర్తించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– వేగి పరిశినాయుడు, రైతు, కశింకోట

మరో దారిలేకే..



నిత్యం పొలాలకు వెళ్లి వ్యవసాయ కార్యకలాపాలు సాగించేందుకు భయంభయంగానే దోనెలపై ప్రయాణం చేస్తున్నాం. ఒక్కోసారి దోనెలు మునిగి ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రత్యామ్నాయం లేక దగ్గరి దారిగా దోనె ప్రయాణాలు సాగించాల్సి వస్తోంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు వంతెన నిర్మాణంపై దృష్టి సారించి, రైతుల ఇక్కట్లు తొలగించాలి.

– మళ్ల లక్ష్మి, మహిళా రైతు

ఆర్థికంగా నష్టపోతున్నాం



శారదానదికి అవతల మా పాడి పశువులు ఉన్నాయి. రోజూ ఉదయం, సాయంత్రం పాలు సేకరించి, తెచ్చేందుకు నదిని దాటి దోనెలపై రాకపోకలు సాగించాలి. నదిలో నీరు పెరిగితే పాలు సేకరించి తెచ్చే అవకాశం లేదు. దీనివల్ల ఆర్థికంగా నష్టపోతున్నాం. పశువుల్ని సాకేందుకు ఇబ్బంది పడుతున్నాం. వంతెన లేకే ఈ దుస్థితి. వంతెన నిర్మించాలి.

– దోకుల కన్నయ్యమ్మ, వెలంపేట

దివ్యాంగులకు ఆదర్శం హెలెన్ కెల్లర్



హెలెన్ కెల్లర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొరుప్రోలు వెంకటేశ్వరరావు, తదితరులు

అనకాపల్లి: అతి చిన్న వయస్సులో వినికిడి, దృష్టిని కోల్పోయి, మాట్లాడలేని స్థితి నుంచి ప్రపంచానికి మార్గదర్శకంగా మారిన హెలెన్ కెల్లర్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొరుప్రోలు వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో హెలెన్ కెల్లర్ 144వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులుగా జన్మించిన వ్యక్తులు భయపడకుండా మనోధైర్యంతో ఉన్నత శిఖరాలను అదిరోహించాలని అభిలసించారు. అనంతరం పేద దివ్యాంగులకు వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హోమ్ ఫ్రమ్ పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి పాలమరశెట్టి పురుషోత్తం, ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత సీనియర్ జనరల్ మేనేజర్ భాస్కర్ పట్నాయక్, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బమ్మిడి రమణ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు ఘన సత్కారం



వీఆర్‌ఎస్ తీసుకున్న హెచ్‌ఎం సోమునాయుడును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

సబ్బవరం: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి బావిభారత పౌరులుగా ఎదగాలని మల్లునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. సోమునాయుడు అన్నారు.

మల్లునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్న ఆయన వలంటరీ రిటైర్మెంట్ ప్రకటించారు.దీంతో ఆయన్ను తోటి ఉపాధ్యాయులు స్థానిక పాఠశాలలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సాంబమూర్తి మాట్లాడుతూ ఆయన శేష జీవితం అంతా ఆనందమయం కావాలని ఆకాంక్షించారు.

కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

పోలీసులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ కేవీ మురళీకృష్ణ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

కశింకోట: జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న నూతన పోలీస్ చట్టాలపై ప్రజలకు అవగాహన కలిగించే కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పోలీస్ అధికారులను ఆదేశించారు. అనకాపల్లిలో ఆదివారం తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందికి నూతన పోలీస్ చట్టాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. కేంద్ర ప్రభుత్వం భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష, భారతీయ సాక్ష్య అధినియం నూతన చట్టాలను ఐసీసీ, సీఆర్పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో అమల్లోకి తీసుకు వచ్చిందన్నారు. ఈ నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. కానిస్టేబుల్ నుంచి పోలీస్ ఉన్నతాధికారుల వరకు ప్రతి ఒక్కరూ నూతన చట్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అవగాహన కలిగి ఉండాలన్నారు. కేసుల దర్యాప్తు చట్ట పరిధిలో జరపాలన్నారు. భారతీయ నాగరిక సురక్షలో పొందుపర్చిన నియమాలను పాటిస్తూ, సాక్ష్యాధారాలను సేకరించి దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. కొత్త చట్టాల ద్వారా నిందితులకు మరింత సమర్థవంతంగా శిక్షలు పడతాయన్నారు. వీటిలో ఎటువంటి సందేహాలున్నా తనను నేరుగా సంప్రదించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, ఇన్‌స్పెక్టర్ లక్ష్మణమూర్తి, ఎస్‌ఐలు రఘువర్మ, రామారావు, సబ్ డివిజనల్ అధికారులు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఎస్‌ఐలు, పీఎస్‌ఐలు, హెచ్‌సీలు, పీసీలు పాల్గొన్నారు.

చురుగ్గా వ్యవసాయ పనులు



అన్నవరంలో పొలం పనులు చేస్తున్న కూలీలు

కోటవురట్ల : వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు, కూలీలు పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు. నారుపోత, కలుపుతీత పనుల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. వారం రోజులుగా మండలంలో వాతావరణం చల్లబడి అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. దాంతో రైతులు ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. గత ఏడాది ఖరీఫ్ సీజనులో 1750 హెక్టార్లలో వరి సాగు జరిగింది. ఈ ఏడాది కూడా ఆరంభంలో వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు ఉత్సాహంగా పొలం పనులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో కొందరు రైతులు నారు కోసం విత్తనాలు చల్లుతుండగా, మరికొన్ని చోట్ల ఇప్పటికే విత్తనాలు వేసిన రైతులు కలుపుతీత పనులు చేపడుతున్నారు.

'మా ఊళ్లో గ్రంథాలయం' సేవలు అభినందనీయం



గుడ్డ సంచులను అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు తులసీరావు

మునగపాక : విద్యాభివృద్ధికి మాఊళ్లో గ్రంథాలయం అందిస్తున్న సేవలు అభినందనీయమని విశ్రాంత ఉపాధ్యాయులు పెంటకోట తులసీరావు కొనియాడారు. మండలంలోని మంగళవరపుపేటలో మా ఊళ్లో గ్రంథాలయం ద్వారా నిర్వహిస్తున్న డ్రాయింగ్,హ్యాండ్ రైటింగ్, తెలుగు పద్యాలను లయబద్ధంగా పాడడం వంటి కార్యక్రమాలపై ఇస్తున్న శిక్షణ తరగతులను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా ఊళ్లో గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా గుడ్డ సంచులను అందజేశారు. కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ రామచంద్రరావు, విశ్రాంత ఉపాధ్యాయులు కిల్లాడ ప్రసాదరావు, గ్రంథాలయ కార్యదర్శి యల్లపు సంజీవరావు, మహిళా డైరెక్టర్లు యల్లపు నాగమణి, ఆడారి సునీత, భీశెట్టి తులసి, గ్రంథాలయాధికారి ఆడారి జగ్గప్పారావు పాల్గొన్నారు.

ఏఎంఏఎల్ కళాశాలకు 'నాక్' గుర్తింపునకు కృషి



జార్జి క్లబ్‌లో సమావేశమైన ఏఎంఏఎల్ కళాశాల పూర్వ విద్యార్థులు

తుమ్మపాల: వేల మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడేలా నాణ్యమైన విద్యనందించిన ఏఎంఏఎల్ కళాశాలకు నాక్ గుర్తింపు వచ్చేందుకు తమ వంతు కృషి చేస్తామని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు బొడ్డేడ అప్పారావు, కృష్ణంరాజు, జగదీశ్వరరావు తెలిపారు. పట్టణంలోని జార్జిక్లబ్ ఆవరణలో నిర్వహించిన ఏఎంఏఎల్ కళాశాల పూర్వవిద్యార్థుల సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. జూలై నెల 18న నాక్ బృందం కళాశాలను పరిశీలించనున్న నేపథ్యంలో వివిధ ఉద్యోగ, వ్యాపారాలలో ఉన్నతంగా స్థిరపడిన పూర్వ విద్యార్థులు హాజరు కావాల్సిందిగా పిలుపునిచ్చారు. కళాశాలలో సోలార్ ప్లాంట్, డైనింగ్ హాల్ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కళాశాలలో చదువుకుని రాజకీయాల్లో, ఉన్నత ఉద్యోగాల్లో, సినిమా రంగంలో రాణిస్తున్న వారిని ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు, పర్యవేక్షకురాలు పి.అనురాధ, వ్యాయామ సంచాలకులు డాక్టర్ కేఎస్ఎన్ నాయుడు, పూర్వ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో భాగస్వాములు కావాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న సంకల్పం సంస్థ ప్రతినిధులు

యలమంచిలి రూరల్ : ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని దినచర్యగా చేపట్టాలని సంకల్పం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని కొత్తపేటలో ఆదివారం ఆ సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న అటవీశాఖాధికారులు చేయాల్సిన ఇలాంటి కార్యక్రమాలను స్వచ్ఛంధ సంస్థలు చేయడం ఆ శాఖ అధికారుల చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు. మొక్కల పెంపకం భావితరాలకు, మానవాళి మనుగడకు ఎంతో అవసరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. అంతకు ముందు మొక్కల పెంపకాన్ని చేపట్టడంపై అందరూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సుమారు 1000 మొక్కల్ని స్థానికులకు పంపిణీ చేశారు నిర్వాహకులు. వర్షాకాలం కావడం, మొక్కలు నాటేందుకు అనుకూల వాతావరణం ఉండడంతో పలువురు మొక్కలు తీసుకునేందుకు ఎగబడ్డారు. కార్యక్రమంలో బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, కొటారు సాంబ పలువురు సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

ఫార్మా వ్యర్థాలు అరికట్టాలని ఆందోళన

పరవాడ: చెరువులు, గెడ్డల్లోకి ఇష్టానుసారంగా ఫార్మా వ్యర్థాలు విడిచిపెట్టడం వల్ల నీరు కలుషితమవుతుందని భర్నికం గ్రామ ప్రజలు వాపోయారు. వ్యర్థజలాలు విడుదల చేస్తున్న ఫార్మా యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో భర్నికం వాసులు మొల్లేటి గెడ్డ వద్ద ఆదివారం ఆందోళనకు దిగారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ మొల్లేటి గెడ్డలోకి వ్యర్థ రసాయనాలు విడిచిపెట్టడం వల్ల గెడ్డలోని నీరంతా కలుషితంగా మారి భరించలేని దుర్వాసన వెదజల్లుతుందన్నారు. పంటలు నాశనమవుతున్నాయ ని ఆరోపించారు.పీసీబీ అధికారులు స్పందించి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకుడు పెదిశెట్టి సత్యారావు డిమాండ్ చేశారు. సముద్ర జలాల్లోకి పంపాల్సిన ఫార్మా వ్యర్థ రసాయనాలను గెడ్డలు, చెరువుల్లోకి వదలడంతో ప్రజారోగ్యం దెబ్బతింటుందని మాజీ సర్పంచ్ బొండా తాతారావు ఆరోపించారు. కార్యక్రమంలో బొండా వెంకట సత్యారావు, జి.అప్పలరాజు, బి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

కోటవురట్ల : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్, ప్రభుత్వ ఉద్యోగుల ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుందని, విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణులు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా చూపు పరీక్ష, ఆటో రీఫ్రాక్షన్, స్లిట్ ల్యాంపు ఎగ్జామినేషన్, డాక్టర్ కన్సల్టేషన్ చేస్తారని తెలిపారు. ఈహెచ్‌ఎస్, టీపీఏ, ఆరోగ్యభద్రత కార్డుదారులకు కేటరాక్టు, రెటీనా, కోర్నియా, గ్లూకోమా, ఆర్బిట్, పీడియాటిక్ అప్తమాలజీ పరీక్షలు చేస్తారని తెలిపారు.

విద్యార్థులతో సూర్య నమస్కారాలు

నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఆదివారం సూర్యనమస్కారాలు, ఆదిత్య హృదయం పారాయణం చేయించారు. వేంపాడు ఆయుష్ ఆస్పత్రికిచెందిన యోగా ట్రైనర్ డీ రాంబాబు పాఠశాలలో విద్యార్థులకు కొన్ని రోజుల నుంచి యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం విద్యార్థులతో ఆదిత్య హృదయం పారాయణం చేయించారు. అనంతరం సూర్య నమస్కారాలు నేర్పించారు. ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు సూర్యనమస్కారాలు ఎంతో ఉపమోగపడతాయని పేర్కొన్నారు.